క్లుప్తంగా

కుక్కల దాడిలో జింక మృతి



గుడిపాల: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. మండలంలోని అడవిచేను గ్రామంలో గురువారం సాయంత్రం ఓ జింక గ్రామంలోకి చొరబడింది. గమనించిన వీధికుక్కలు దాన్ని వెంబడించి దాడి చేయడంతో జింక మృతిచెందింది. వెంటనే స్థానికులు గమనించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమకు సమాచారం అందించారు. ఆమె వెటర్నటీ డాక్టర్ సాయిసుధకు సమాచారం అందించారు. ఆమె జింకకు పోస్ట్ మార్టం నిర్వహించి ఖననం చేశారు.

గంబూసియా చేప పిల్లలతో దోమల నివారణ



చేప పిల్లలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

బంగారుపాళెం: దోమల నివారణ కోసం గురువారం చెరువులు, కుంటల్లో గంబూసియా చేప పిల్లలను విడిచిపెట్టినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ తెలిపారు. మండలంలోని ముంగరమడుగు, తగ్గువారిపల్లె గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలిపెట్టామన్నారు. గంబూసియా చేప పిల్లలు దోమ లార్వాలను మింగి దోమలు వృద్ధి చెందకుండా అరికడతాయన్నారు. సాయంత్రం పూట ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హరికృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి చంద్రమహేష్ 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు పరీక్షలు చేశారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుజిత, అనిత, చంద్ర, విజయ, ఎలవతి పాల్గొన్నారు.

తల్లికి వందనం.. అయోమయం



- భారంగా మారిన చదువులు
- ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల కోసం ఒత్తిడి
- ఇబ్బందుల్లో తల్లిదండ్రులు

ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు తెరచుకుని నెల రోజులవుతోంది. పిల్లల్ని తల్లిదండ్రులు బడుల్లో చేర్పించేశారు. ఫీజుల్లో మొదటి విడత బకాయి చెల్లించాలని తల్లిదండ్రులపై ప్రైవేటు పాఠశాలల ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఓ కుటుంబంలో ఎందరు పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం పేరిట ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత నివ్వకపోవడంతో అయోమయం నెలకొంది.

చిత్తూరు అర్బన్/కాణిపాకం: బడి గంట మోగి నెలరోజులైంది. పేద పిల్లల చదువులు పట్టాలెక్కాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి బడి కష్టాలు మొదలయ్యాయి. చదువులు భారంగా మారాయి. ప్రైవేటు బడుల్లో ఫీజుల మోత మోగుతోంది. పెరిగిన ఫీజులతో తల్లిదండ్రుల్లో గుబులు పుట్టుకుంది. దీనికి తోడు తల్లికి వందనం పథకంలో జాప్యంతో పాటు అయోమయం చోటు చేసుకుంది. పథకం అమలులో ఇప్పటికే స్పష్టత లేకపోవడం గందరగోళానికి తావిస్తోంది.

ఎన్నికల ముందు హామీ

'తల్లికి వందనం పథకం కింద ప్రతి పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున అందిస్తాం. ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తాం' అంటూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇది. బడులు తెరిచి నెలరోజులవుతున్నా తల్లికి వందనం అందలేదు. తాజాగా విడుదల చేసిన జీవోలో స్పష్టత లేదు. కేవలం విద్యార్థి తల్లికి మాత్రమే రూ.15వేలు అని ఉంది. దీంతో ఈ పథకం సాఫీగా అమలవుతుందన్న ఆశ సగం చచ్చిపోయింది. దీనికి అర్హతగా కేవలం 75 శాతం హాజరు అని జీవోలో పేర్కొన్నారు. పేదల విద్యార్థులను ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టి పకడ్బందీలు అమలు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే పేదల తల్లుల ఖాతాలకు ఏటా రూ.15 వేల చొప్పున అందించింది. 2019 నుంచి సార్వత్రిక ఎన్నికల వరకు నాలుగు విడతల్లో తల్లుల ఖాతాలకు కోట్లాది రూపాయలు జమ చేసింది. తద్వారా డ్రాపవుట్స్ సమస్యకు చెక్ పెట్టింది. ప్రతి తల్లి తన పిల్లల్ని బడికి పంపేలా ప్రోత్సహించింది. అమ్మఒడి సాయాన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకూ ఉపయోగపడింది. దీంతో పేదల చదువులు చక్కబడ్డాయి.

ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి పూతలపట్టు నియోజకవర్గంలో ప్రాథమిక పాఠశాలలు 297, ప్రాథమికోన్నత పాఠశాలలు 35, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 42 ఉండగా 17,975 మంది చదువుతున్నారు. అలాగే 20కుపైగా ప్రైవేటు పాఠశాలలు 10వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఏడు జూనియర్ కళాశాలల్లో 4వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అందరికీ ఈ పథకం కింద సాయం అందిస్తామని కూటమి ప్రకటించింది. ఇక చాలా మంది విద్యార్థులు ప్రైవేటు బడుల నుంచి ప్రభుత్వ బడులను ఆశ్రయిస్తున్నారు.

తప్పని కష్టాలు

అప్పులు చేసి పిల్లలకు ప్రైవేటు బడుల్లో ఫీజులు కట్టారు. యూనిఫాం, పుస్తకాలు కొనిపెట్టారు. కొంత మంది తల్లిదండ్రులు ఈఎంఐకు ఒప్పుకున్నారు. ప్రభుత్వ బడికెళ్లే పిల్లల తల్లిదండ్రులు నోటుపుస్తకాలు, బట్టలు కొనిచ్చారు. తల్లికి వందనం ద్వారా రూ. 15వేలు చొప్పున ఇస్తారనే నమ్మకంతో అప్పులు చేశారు. అయితే ఇంత వరకు పథకంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. బడులు పునః ప్రారంభమై, నెల కావస్తున్నా ఇంత వరకు వందన సాయం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డ్రాపౌట్ పిల్లల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఎదురు చూపులు

చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో మొత్తం 328 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలున్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 205, ప్రాథమికోన్నత పాఠశాలలు 43, ఉన్నత పాఠశాలలు 80 వరకు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థులున్నారు. వీళ్లలో సగటున 70 శాతం మంది పిల్లలకు ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ఒక కుటుంబంలో ఎందరు పిల్లలు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన టీడీపీ.. ఇపుడు అధికారంలోకి వచ్చాక మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులో కొన్ని చోట్ల ఒక్కో తల్లికి రూ.15 వేలు అనే పదాన్ని పలుమార్లు ఉపయోగించారు. ఇక ఒకే తల్లికి ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే వాళ్ల పరిస్థితి ఏమిటి..? పిల్లలు ఎందరు ఉన్నా రూ.15 వేలే ఇస్తారా..? అనే ప్రశ్నలకు జీవోలో ఎలాంటి స్పష్టత లేకపోవడం తల్లిదండ్రులకు గందరగోళానికి గురిచేస్తోంది. దీనికితోడు అసలు డబ్బులు ఎప్పుడు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయో తెలియక ఎదురుచూపులు చూస్తున్నారు. పైగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించాలని, లేకుంటే పిల్లల్ని బయట నిలబెడుతామని కొన్ని యాజమాన్యాలు ఒత్తిడిను పెంచుతున్నాయి.

ఒత్తిడి చేస్తున్నారు



ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల ఒత్తిడి పెరిగింది. వేలకు వేలు అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నాం. ఈసారి ప్రభుత్వం పిల్లల చదువుకు సాయం చేస్తామని హామీనిచ్చింది. నా భర్త కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన దాంట్లో ఇంటి అద్దె కట్టి, పిల్లలను స్కూలుకు పంపిస్తున్నాం. పాప 5వ, బాబు 3వ తరగతి చదువుతున్నారు. వారి చదువులకు సంవత్సరానికి రూ.60వేల వరకు ఖర్చు అవుతోంది. ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తే సగం చదువు భారం తగ్గుతుంది అనుకున్నాం. ఫస్ట్ టెర్మ్ ఫీజు కట్టమని స్కూల్‌లో ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించాలి.

–హేమావతి, సంతపేట

పిల్లల చదువులు భారం



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మా పిల్లలు తిరుపతి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. మా పిల్లలకు ఫీజు కట్టలేక పాఠశాల యాజమాన్యం ఇబ్బందులు పెడుతోంది. గతంలో అమ్మ ఒడి పథకం కింద సకాలంలో డబ్బులు అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం పిల్లలకు తల్లికి వందనం కింద ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే అమ్మకు వందనం పథకాన్ని అమలు చేసి తల్లుల ఖాతాలకు డబ్బులు జమ చేయాలి.

– కల్పన, తల్లి, వెంగంపల్లె, తవణంపల్లె

తల్లికి వందనం ఎప్పుడో?



మాది దిగువమోదలపల్లె. నాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద డబ్బులు వేస్తామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. పిల్లల చదువులకు, నోట్‌బుక్‌లు, పెన్నులు కొనుగోలు చేయలేక ఇబ్బందిపడుతున్నాను. ప్రభుత్వం సకాలంలో తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తే పిల్లలకు కావసిన వస్తువులు కొనిస్తాను.

–తులసి, దిగువ మోదలపల్లె, తవణంపల్లె

త్వరగా డబ్బులివ్వండి



తల్లికి వందనం కార్యక్రమానికి సంబంధించి ముందుగా స్పష్టత ఇవ్వాలి. ఇందుకు ఎవరు అర్హులు? ప్రైవేటు బడికి వెళ్లే పిల్లల తల్లులకు ఇది వర్తిసుందా..లేదా? చెప్పాలి. దీనిపై మాకు ఇంత వరకు ఎలాంటి సమాచారం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్న తల్లి వందనం ఇవ్వలేదు. ఇద్దరు కుమారులు ప్రైవేటుస్కూల్లో చదివిస్తున్నాం. ఫీజులు కట్టలేకున్నాం. యూనిఫాం, పుస్తకాలకు అప్పులు చేసి కొన్నాం. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం త్వరగా ఇవ్వాలి.

– విజయరాణి, చిత్తూరు మండలం

పిల్లలకు అవసరాలున్నాయి



మా ఇద్దరు పిల్లలు తాళంబేడు ప్రభుత్వ బడిలో చదువుతున్నారు. ప్రస్తుత రోజుల్లో పిల్లల చదువు భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. తల్లికి వందనం డబ్బులు ఇస్తే నోటు పుస్తకాలు, బట్టలు, పిల్లలకు అవసరమయ్యే కొన్ని వస్తువులను కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. ఇంత వరకు పథకం అమలుపై ఏమీ చెప్పలేదు. ఇద్దరు పిల్లలకు ఇస్తారా లేదా తెలియడం లేదు. ప్రభుత్వం చెప్పినట్టు తల్లికి వందనం పథకాన్ని ఇద్దరు పిల్లలకు వర్తింపజేసి రూ.15 వేల చొప్పున ఇవ్వాలని వేడుకుంటున్నాం.

–వనిత, చింతలగుంట, చిత్తూరు మండలం

మండల సమాఖ్య అభివృద్ధికి కృషి



మండల సమాఖ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీయం సుధారాణి

గుడిపాల: మండల సమాఖ్య అభివృద్ధికి ప్రతి ఒక్కరి కృషి అవసరమని ఇందిరా క్రాంతి ఏపీయం సుధారాణి తెలిపారు. మండలంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఆమె అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను వాయిదాల్లో సకాలంలో చెల్లిస్తే వడ్డీలేని రుణాలు వస్తాయని చెప్పారు. తీసుకుంటున్న రుణాల గురించి మహిళలు వివరంగా తెలుసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు యానిమేటర్లు, సీసీల ద్వారా వివరాలను తెలుసుకుంటూ ఉండాలని కోరారు. అనంతరం ఈ సంవత్సరం వచ్చిన ఆదాయ వివరాలను చదివి వినిపించారు. మండల సమాఖ్యలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.5,84,630 లాభంలో ఉందన్నారు. మొత్తంలో చూసుకుంటే రూ.80,78,725 లాభాల్లో ఉందన్నారు. దీంతో పాటు చిన్నతరహా పరిశ్రమలను పెట్టుకోవడానికి డ్వాక్రా మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సాంబశివనాయుడు, వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

మండల సమాఖ్య నూతన కమిటీని గురువారం మండల సమాఖ్య అధ్యక్షురాలిగా కార్తి, ఉపాధ్యక్షురాలిగా సంధ్య, కోశాధికారిగా జమునను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి

పూతలపట్టు: హాస్టల్ విద్యార్థుల వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. ఆమె గురువారం మండలంలోని పి.కొత్తకోట బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. హాస్టల్ సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులచే లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వెనుక ఉండే చెత్త దిబ్బలను తొలగించాలని చెప్పారు. ఆ దిబ్బల ద్వారా విద్యార్థులకు విషజ్వరాలు వ్యాపిస్తాయని, వాటిని ఉంచకూడదని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలియజేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్న కుటుంబం..చింతలేని కుటుంబం



చిత్తూరు: అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు



యాదమరి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిన్న కుటుంబమే చింతలేని కుటుంబమని డీఆర్ఓ పుల్లయ్య అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఎక్కువైతే వారిని పోషించుకోవడానికి కుటుంబ పెద్ద తీవ్రంగా కష్టపడాల్సి వస్తోందన్నారు. దీనికి తోడు ఒకవైపు ఆర్థిక కష్టాలు మరో వైపు ఆరోగ్య సమస్యలు వేధిస్తాయన్నారు. ఈ ప్రభావం ముందు కుటుంబంపై తర్వాత దేశంపై చూపుతోందన్నారు. బాల్య వివాహాలు జనాభా పెరుగుదలకు కారణమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జనాభా పెరుగుదల పరిణామాలు, సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతిదేవి, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఎస్ఓ జార్జ్, అధికారులు శ్రీవాణి, శిరీష, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆటంకం

గుడిపాల: విపరీత జనాభా పెరుగుదల అభివృద్ధికి ఆటంకమే కాకుండా ప్రకృతి అసమతౌల్యానికి కారణమని ప్రాథమిక ఆరోగ్యాధికారి సంధ్య తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పీహెచ్‌సీలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం తీసుకొచ్చేందుకు ఐక్యరాజ్య సమితి 1989 జూలై 11ను అంతర్జాతీయ జనాభా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు అన్న నినాదంతో ర్యాలీ నిర్వహించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్ర, మహేష్, విజయతో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

బంగారుపాళెం: జనాభా నియంత్రణతోనే దేశ సమగ్రాభివృద్ధి అని తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, సెల్వరాజ్, హెల్త్‌సూపర్ వైజర్లు అముద, హరికృష్ణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జనాభా దినోత్సవం

పూతలపట్టు: మండల కేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది కలిసి ఉన్నత పాఠశాల విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి అధికారులంతా విద్యార్థులతో కలిసి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణా, సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

యాదమరి(పూతలపట్టు): మండల కేంద్రంలోని సంతగేటు పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆశావర్కర్లు కుటుంబ నియంత్రణ పోస్టర్లు ఆవిష్కరించారు. గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని బుడితిరెడ్డిపల్లెలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్టేట్ నోడల్ ఆఫీసర్ నరసింహ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాఖా సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

తవణంపల్లె: తాత్కాలిక కుటుంబ నియంత్రణతో ఆరోగ్యంగా జీవించవచ్చని డాక్టర్ ప్రియాంక అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని వివరించారు. వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్, సీహెచ్‌ఓలు రాజామణి, సుబ్రమణ్యం, సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.







గుడిపాల: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, బంగారుపాళెం: పోస్టర్ల ఆవిష్కరణ, తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది